నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I | హైదరాబాద్, ఆదివారం 26 జనవరి 2025 | SIDDIPET

హరీశ్‌రావు చొరవతో ఇండ్ల స్థలాల పంపిణీ

చిన్నకోడూరు తహసీల్ కార్యాలయం ఎదుట ఇండ్ల స్థలాల పట్టాలతో లబ్ధిదారులు

చిన్నకోడూరు, జనవరి 25: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు చొరవతో చిన్నకోడూరు మండలం చర్ల అంకిరెడ్డి పల్లిలో పలువురికి ఇండ్ల స్థలాల పట్టాలు అందాయి. శనివారం తహసీల్ కార్యాలయంలో పట్టాలు తీసుకుని మాట్లాడారు. ఇండ్ల స్థలాల గురించి మూడేండ్ల నుంచి హరీశ్‌రావుకు వినతి పత్రాలు అందించామన్నారు. అప్పుడే ఆయన అధికారులను గ్రామానికి పంపించి సర్వే చేయించారని గుర్తుచేశారు. సర్వేనెంబర్ 216లో ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని, 25 మంది అర్హులను ఎంపిక చేసి గ్రామపంచాయతీలో నోటీసు బోర్డు వేసి నట్లు తెలిపారు. తర్వాత హరీశ్‌రావు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహించి, వీలైనంత తొందరగా ఇండ్ల స్థలాల పట్టాలు అందజేయాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారని గుర్తుచేశారు. ఎట్టకేలకు తమకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇప్పించినందుకు హరీశ్‌రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాలిపల్లి లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ కొండం ఇంద్ర సేనారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గాలి పల్లి అనిల్, నాయకులు రాగి నాగరాజు, మానాల రమేశ్ పాల్గొన్నారు.

ఘనపూర్‌కు సింగూరు జలాలు

సింగూరు జలవిద్యుదుత్పత్తి కేంద్రం గేటు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న జలాలు

పుల్కల్, జనవరి 25: మెదక్ జిల్లా ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు ప్రాజెక్టు నుంచి శనివారం ఉదయం 0.35 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. ఏటా ఈ సమయంలో వ్యవసాయ సాగు పనుల కోసం నీటిని విడుదల చేస్తామన్నారు. రైతుల పంట పొలాలను దృష్టిలో ఉంచుకొని రెండోసారి ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు నీటిని విడుదల చేశామని ఏఈ తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సింగూరు జల విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 20మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు పోచంపాడ్ సీఈ రమేశ్‌బాబు విలేఖరులకు తెలిపారు. జెన్‌కో ద్వారా దిగువకు 2842 క్యూసెక్కుల నీరు వెళ్తున్నదన్నారు. ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో మత్స్య కాపరులు, మేకలు, గొర్రెల కాపరులు నది పరీవాహక ప్రాంతాలకు వెళ్లకుండా అధికారులకు సహకరించాలని సూచించారు.

నేడు కొమురవెల్లి మల్లన్న లష్కర్ వారం

చేర్యాల, జనవరి 25: కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్లన్నక్షేత్రానికి భారీగా భక్తులు తరలివస్తున్నారు. స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా రెండో ఆది(లష్కర్)వారానికి సికింద్రాబాద్ భక్తులతో పాటు ఉమ్మడి కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోనున్నారు. సికింద్రాబాద్ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. రెండో ఆదివారానికి లష్కర్‌వారంగా ఆనాదిగా పిలుస్తున్నారు. శనివారం సాయంత్రానికి భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల ద్వారా మల్లన్న క్షేత్రానికి చేరుకొని మల్లన్నను దూళి దర్శనం చేసుకోనున్నారు.లష్కర్ వారం సందర్భంగా భక్తులు మల్లన్నకు పట్నం వేసి, బోనం సమర్పించడంతో పాటు అమ్మవార్లకు ఒడి బియ్యం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకోనున్నట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.లష్కర్ వారానికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించామని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, జనవరి 25: ప్రజాస్వామ్యం ఓటు వజ్రాయుధంతో సమానమని, యువతకు ఓటు విలువ,ఎన్నికల ప్రక్రియ గురించి తెలుసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి అన్నారు. శనివారం సిద్దిపేటలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన 15వ ఓటరు దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా మాస్టర్ ట్రైనర్ అయోధ్య రెడ్డి ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. నూతన ఓటరు దరకాస్తుకు ఫారం-6, అడ్రస్ మార్చుకునేందుకు ఫారం-8, ఇతరత్రా ఓటరు దరఖాస్తు విధానం గురించి యువతకు వివరించారు. ఈసీఐ వెబ్‌సైట్‌లో లేదా బూత్‌లెవల్ అధికారులకు సంబంధిత పత్రాలు ఇచ్చి ఓటరు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు ఉన్నాయని, వాటి గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు, ఉత్తమ ప్రదర్శన కనబరిచిన బీఎల్‌వోలకు, సిబ్బందికి కలెక్టర్ ప్రశంశా పత్రాలు అందజేశారు. ఆర్డీవో సదానందం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీత, తహసీల్దార్లు వెంకటేశ్, సలీం, మున్సిపల్ కమిషనర్ అశిత్ కుమార్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులను ఆకర్షించేలా అర్బన్ పార్కులు

- రాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శరవణన్

అక్కన్నపేటలో అటవీశాఖ అధికారులకు సూచనలిస్తున్న రాష్ట్ర సీసీఎఫ్ శరవణన్

రామాయంపేట, జనవరి 25: పర్యాటకులను ఆకర్షించేలా అర్బన్ పార్కులను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్నదని రాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శరవణన్ అన్నారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేటలో అర్బన్ పార్కు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అక్కన్నపేట ఫారెస్టును పరిశీలించి అనంతరం సీసీఎఫ్ మాట్లాడుతూ.. నగర వన యోజన పథకం కింద ప్రజలు సేదతీరేందుకు అన్ని హంగులతో విశాలమైన స్థలంలో అర్బన్ పార్కుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అటవీ సంరక్షణకు సిబ్బంది కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అడవులు బాగుంటేనే మానవ జీవనం సాఫీగా సాగుతుందని తెలిపారు. ఆయన వెంట జిల్లా అటవీశాఖ అధికారి ఎం.జోజి, రామాయంపేట ఎఫ్‌ఆర్‌వో విద్యాసాగర్, డీఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్ నాయక్, అటవీ శాఖ సంరక్షకుడు లక్ష్మణ్ ఉన్నారు.

నాగేటి సాళ్లో సావుకేకలు



ఏడాదిలో 96 మంది రైతుల బలవన్మరణం

రాష్ట్రంలోనే మెదక్ జిల్లాలో అత్యధిక రైతు ఆత్మహత్యలు

కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతులకు చేయూత కరువు

96 మంది రైతుల బలవన్మరణం

గుండె చెదిరిన రైతుకు ధైర్యం చెబుతున్న బీఆర్ఎస్

త్వరలోనే మెతుకుసీమలో పర్యటించనున్న బీఆర్ఎస్ బృందం

సిద్దిపేట, జనవరి 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎద్దు ఏడ్చిన ఎవుసం..రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రస్తుతం అదే జరుగుతున్నది.కాంగ్రెస్ ఏడాది పాలనలో ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతు ఆత్మహత్యలు పెరిగాయి. నాటి సమైక్య రాష్ట్ర నాటి పరిస్థితులు దాపురించాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతుల ఆత్మహత్యలు జరిగాయి. సాగుకు కాంగ్రెస్ సర్కార్ చేయూత కరువు కావడంతో రైతన్న రంది చెందుతున్నాడు. ప్రభుత్వం పెట్టుబడి సాయం ఎగ్గొట్టింది..రుణమాఫీ అసంపూర్తిగా చేసింది. రైతుబీమా రావడం లేదు. రైతులకు ప్రభుత్వం నుంచి భరోసా కరువైంది. పంటలకు తెచ్చిన అప్పులు తడిసి మోపెడయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేక తనలో తాను రైతు కుమిలిపోయి చావే శరణ్యం అంటున్నాడు. ఏడాది కాంగ్రెస్ పాలనలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలో 96 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులు పిట్టల్లా రాలిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదు. నాడు కేసీఆర్ ప్రభుత్వం రైతుకు దన్నుగా నిలిచింది. సకాలంలో రైతుబంధు కింద పంట పెట్టుబడి సాయం అందించింది. ప్రాజెక్టుల ద్వారా సీజన్‌కు ముందే సాగునీరు అందించింది. 24గంటల కరెంట్ సరఫరా చేసింది. రైతుబీమాతో ధీమా కల్పించింది. గ్రామంలోనే సెంటర్లు ఏర్పాటు చేయించి మద్దతు ధరకు ధాన్యం కొని అండగా నిలిచింది. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఆ పరిస్థితులు లేక పోవడంతో రైతు ధైర్యాన్ని కోల్పోతున్నాడు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నేతృత్వంలో బీఆర్ఎస్ నియమించిన రైతు కమిటీ ఉమ్మడి మెదక్ జిల్లాలో త్వరలో పర్యటించి రైతులకు ధైర్యాన్ని నూరిపోయనున్నది.

మెతుకుసీమలో పిట్టల్లా రాలుతున్న అన్నదాతలు...

రేవంత్‌రెడ్డి సర్కారు వచ్చాక ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతు ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. ఇటీవల బీఆర్ఎస్ విడుదల చేసిన జాబితా ప్రకారం, క్షేత్రస్థాయిలో వాస్తవంగా రైతుల ఆత్మహత్యల వివరాలను చూసుకుంటే మెదక్ జిల్లాలో 62 మంది , సిద్దిపేట జిల్లాల్లో 20 మంది, సంగారెడ్డి జిల్లాలో 14 మంది, మొత్తంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 96 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రోజుకో రైతు తనువు చాలిస్తున్నాడు. ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచింది. రెండు లక్షల రూపాయల రుణమాఫీ పూర్తిగా చేయలేదు. దీంతో చాలామంది రైతులు బ్యాంకుల్లో మిత్తిలు కట్టలేక అప్పుల పాలవుతున్నారు. రెండు లక్షల పైన ఉన్న డబ్బులు కట్టుమంటే వాటిని కట్టారు. తీరా కట్టాక రెండు లక్షల రూపాయల రుణమాఫీని కాంగ్రెస్ సర్కార్ మరిచి పోయింది. దీంతో బ్యాంకులో ఉన్న అప్పుకు తోడు.. బ్యాంకు మిత్తి కట్టడానికి తెచ్చిన డబ్బులకు వడ్డీ తడిసి మోపెడు అయ్యాయి. దీంతో రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. పంట పెట్టుబడి సాయం రావడం లేదు. సాగుకు ముందు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లి అప్పులు తెచ్చి సాగు చేస్తున్నారు. పంట చేతికి వచ్చే సరికి పంట సాగుకు చేసిన ఖర్చు, వడ్డీకి తెచ్చిన అప్పులు, వాటికి మిత్తి అన్ని కలిపి పంట మొత్తం వాటికే పోతున్నది. రైతులకు కష్టం మాత్రమే మిగులుతోంది. దీంతో ఆత్మస్థైర్యం కోల్పోయి రైతులు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ సర్కార్

కాంగ్రెస్ ఎన్నికల ముందు రైతులకు రైతుభరోసా కింది ఎకరానికి ఎటా రూ. 15 వేలు ఇస్తానని చెప్పి రెండు పంటలకు ఎగ్గొట్టింది. కేసీఆర్ ప్రభుత్వంలో రంచన్‌గా పంట సాగుకు ముందే రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో ఎకరానికి రూ. 5వేల చొప్పున, ఏటా రెండు పంటలకు రూ.10 వేల చొప్పున పంట సాయం అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఆ డబ్బులు రావడం లేదు. ఇప్పటికి రెండు పంటల రైతుభరోసా డబ్బులను రైతులకు కాంగ్రెస్ బాకీ పడింది. రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేసింది. అన్ని పంటలకు బోగస్ అని చెప్పి బోగస్ చేసింది. రైతులు యాసంగిలో పంట వేయడానికి వెనకా ముందు ఆలోచన చేయల్సిన దుస్థితి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులకు నమ్మకం లేక యాసంగిలో సగం భూముల్లో సాగుచేయలేదు. ప్రాజెక్టుల ద్వారా నీళ్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఈ ప్రభుత్వం సరిగా ఇవ్వడం లేదు. జనవరి చివరి మాసంలోనే కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయి. వెరసి రైతులకు కాంగ్రెస్ పాలనలో అన్ని కష్టాలే దాపురించాయి.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

- గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం
- మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోలీస్ అధికారులు

పటాన్‌చెరు/అమీన్‌పూర్, జనవరి 25: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీలోని బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో సైబర్ నేరాలపై పోలీసులు ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో సైబర్ నేరాలు బాగా పెరిగాయని, ప్రధానంగా అమీన్‌పూర్ ప్రాంతంలో ఎక్కువగా జరుగుతున్నట్లు చెప్పారు. సైబర్ నేరగాళ్ల వలలో విద్యావంతులే అధికంగా మోసపోతుండడం బాధాకరమని పేర్కొన్నారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఇతర ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిపారు. ఏ పోలీసు అధికారి నేరుగా వాట్సాప్ వీడియో కాల్స్ చేయరని, డిజిటల్ అరెస్టులు అని చేసే కాల్స్ వస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్ల బలంగా మారిందన్నారు. మారుతున్న టెక్నాలజీ, అందుబాటులోకి వచ్చిన ఏఐ టెక్నాలజీతో మోసగాళ్లు చెలరేగిపోతున్నారని, అప్రమత్తంగా ఉంటేనే నష్టం జరగదన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే తక్షణం 1930లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

గంజాయిపై ఉక్కుపాదం...

గంజాయి సేవనం అన్ని ప్రాంతాల్లో పెరిగిందని ఎస్పీ రూపేశ్ తెలిపారు. డ్రగ్స్, గంజాయి మహమ్మారి బారినపడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరదాగా మొదలెట్టిన ఈ వ్యసనాలు ప్రాణాంతకంగా మారుతాయని తెలిపారు. మాదకద్రవ్యాలను వాడుతున్నట్టుగా గుర్తిస్తే సంబంధిత విద్యాసంస్థ నుంచి విద్యార్థిని టెర్మినేట్ చేయిస్తామని ఎస్పీ హెచ్చరించారు. గంజాయిపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటానని ఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణు గోపాల్‌రెడ్డి, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ పి.నరేశ్, ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా అమీన్‌పూర్

- పదవులు ఉన్నా లేకపోయినా ప్రజలతో మమేకం కావాలి..
- అమీన్‌పూర్ పురపాలక సంఘం పాలకవర్గం వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పాలకవర్గంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, జనవరి 25: అమీన్‌పూర్ మున్సిపల్ పాలకవర్గం సమిష్టిగా పనిచేసి మున్సిపాలిటీని అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాలకవర్గం వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న అమీన్‌పూర్‌ను మున్సిపాలిటీగా మార్చి నట్లు తెలిపారు. గత ఐదేండ్లలో మున్సిపాలిటీ శరవేగంగా విస్తరించిందన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశామని తెలిపారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా ప్రజలు మళ్లీ అవకాశం ఇస్తారని తెలిపారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి హాజరైన వివిధ వర్గాల ప్రజలు

ఫిబ్రవరి 7న హైదరాబాద్‌కు తరలిరావాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సిద్దిపేట అర్బన్, జనవరి 25: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే 'లక్ష డప్పులు, వేల గొంతుకలు' సన్నాహక సమావేశాన్ని సిద్దిపేట లోని వయోలా గార్డెన్‌లో శనివారం నిర్వహించగా, ఈ సమావేశానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు సిద్దిపేటలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి అక్కడి నుంచి వయోలా గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. మాదిగల ఆకాంక్షను ప్రపంచానికి చూపెట్టేందుకు ఫిబ్రవరి 7న మహత్తర సాంస్కృతిక కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. జాతి బిడ్డల భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. నాడు సమైక్యాంధ్ర వాదులు, లగడపాటి చేసిన పనే నేడు మాలలు చేస్తున్నారని పేర్కొన్నారు. నాడు లగడపాటి పోషించిన పాత్రే నేడు వెంకటస్వామి కుటుంబం పోషిస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రం కోసం అనేక పార్టీలతో లేఖలు రాయిస్తే.. వర్గీకరణ కోసం తాను కూడా లేఖలు రాయించానన్నారు. గతంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో తీర్పువస్తే 24 గంటల్లోపే అమలు చేసిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు సుప్రీంకోర్టు వర్గీకరణ అమలు తీర్పు ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. తీర్పు వచ్చిన వెంటనే అసెంబ్లీలో ప్రస్తావించిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వర్గీకరణను అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాల నాయకులకు రేవంత్‌రెడ్డి తలొగ్గారన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మాలలను ప్రోత్సహిస్తున్నదన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన రాజకీయ నాయకులు సభలు పెట్టి వర్గీకరణను అడ్డుకుంటామని తొడలు కొట్టి, మీసాలు తిప్పుతున్నారని.. కానీ, తాము మాత్రం శాంతియుతంగానే ఉద్యమం చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పెర్క పరశురాములు, యాదగిరి, శ్రీనివాస్, కృష్ణ, జువ్వన్న కనకరాజు, ప్రసాద్, శంకర్, ఇస్తారి, రమేశ్ పాల్గొన్నారు.

పాల్గొన్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

గిరిజన బిడ్డకు రెండు కొలువులు

జవహర్‌లాల్‌నాయక్

రామాయంపేట, జనవరి 25: మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గిరిజన తండాకు చెందిన జవహర్‌లాల్ నాయక్ రెండు సర్కారు కొలువులు సాధించి సత్తాచాటాడు. మారుమూల తండాలో పుట్టిన జవహర్‌లాల్ నాయక్ చదువులో మెరిటో స్టూడెంట్. గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం ప్రతిరోజు కాలినడకన వెళ్లి చదువుకున్నాడు. ఇటీవల సెంట్రల్ వాటర్ కమిషన్‌లో జూనియర్ ఇంజినీర్‌గా కొలువుకు ఎంపిక అయ్యాడు. శుక్రవారం టీజీపీఎస్సీ వెలువరించిన ఫలితాల్లో నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా రెండో ఉద్యోగం సాధించాడు. దీంతో ఆయన కుటుంబంలో సంతోషం నెలకొంది. జవహర్‌లాల్ నాయక్‌ను గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులతో పనులు

ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 25: సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులతో పనులు చేయించిన ముగ్గురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు పడింది. శనివారం సంగారెడ్డి పట్టణంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో పనులు చేయించారు. కంకర, రాళ్లు మోస్తున్న విద్యార్థుల ఫొటోలు వైరల్ కావడంతో ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. వెంటనే స్పందించిన కలెక్టర్ వల్లూరి క్రాంతి సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై విచారణ జరిపిన జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు సంబంధిత ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకుకారణమైన పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయులు మంజుల, శారద, నాగమణిని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనపై కలెక్టర్ ఆదేశాలతో కార్మికశాఖ అధికారులు పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ ఘటనపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఫైర్ అయ్యారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి విద్యార్థులతో కంకర మోయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను పని మనిషుల్లా మార్చేస్తున్న ఘటనపై మండిపడ్డారు. బడిపిల్లలా.., పని పిల్లలా.., పుస్తకాలు పట్టుకునే వయస్సులో కంకర రాళ్లు మోయడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేరని విమర్శించారు. ముఖ్యమంత్రికి విద్యా వ్యవస్థపై పట్టింపులేదని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ హయాంలో కొత్తరూపు

బల్దియాలకు నిధుల వరద పారించిన కేసీఆర్

- బీఆర్ఎస్ హయాంలో మున్సిపాలిటీల్లో గణనీయ అభివృద్ధి
- జెండా వందనంతో నేడు ముగియనున్న మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం
- 27 నుంచి ప్రత్యేకాధికారులు పాలన

బీఆర్ఎస్ హయాంలో ప్రగతిబాట...

సంగారెడ్డి, జనవరి 25(నమస్తే తెలంగాణ): జెండా వందనంతో జిల్లాలోని మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీకాలం ముగియనున్నది. పంచాయతీలు ఇది వరకే ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లగా, 27వ తేదీ నుంచి మున్సిపాలిటీల్లోనూ ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానున్నది. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, నారాయణఖేడ్, అందోలు-జోగిపేట, బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల్లో చైర్మన్ల పదవీకాలం ఆదివారంతో ముగుస్తుంది. 2020 జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. 27 జనవరి, 2020 ఎనిమిది మున్సిపాలిటీల్లో కొత్త పాలకవర్గాలు కొలువు దీరాయి. ఐదేండ్ల మున్సిపల్ పాలక వర్గాల పదవీకాలం నేటితో ముగియనున్నది. మున్సిపల్ ఎన్నికల్లో ఎనిమిది మున్సిపాలిటీలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలోని మున్సిపాలిటీల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా మున్సిపాలిటీలు అభివృద్ధి బాటపట్టాయి. బీఆర్ఎస్ హయాంలో జిల్లా మంత్రిగా ఉన్న హరీశ్‌రావు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులతో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. సంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో రూ.250 కోట్ల ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేయించారు. రూ.10కోట్లతో శ్మశాన వాటికల్లో ఆధునిక వసతులు కల్పించి వైకుంఠధామాలుగా అభివృద్ధి చేశారు. రూ. 38.50 కోట్లతో ప్రతి మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ వెజ్,నాన్‌వెజ్ మార్కెట్లను కేసీఆర్ ప్రభుత్వం నిర్మించింది. రూ. 82.59 కోట్లతో అర్బన్ మిషన్ ద్వారా జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నది. నారాయణఖేడ్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ హయాంలో రూ.25 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధుల